# కథాకేళి



# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## తేట తెలుగుతనం

ప్రవాసాంధ్రుల కష్టాలు బహు ముఖాలు. భిలాయ్‌లో ఆరేళ్లుగా పనిచేస్తున్న నేను ప్రవాసాంధ్రుల మీద ఓ థీసిస్ రాసి సబ్‌మిట్ చేస్తే ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ఇస్తుందన్న నమ్మకం నాకుంది.

అలాంటి కష్టాల్లో మొదటిది తోటి తెలుగువాడే. హిందీలో మాట్లాడడం, మా ఇంటి కొచ్చే పేపర్ని మాకన్నా ముందే చదివేయడం, కులాల్ని బట్టి విడిపోయి అకారణ ద్వేషం పెంచుకోవడం లాంటివి భరించవచ్చు. కాని ఇద్దరి కామన్ స్వంత వూరు ఏ గుడివాడో వెళ్లి వచ్చినప్పుడు మనింటికి వెళ్లి ఓసారి కనబడిరాని మన మిత్రుడు భిలాయ్‌లో మన ఇంటి ఎదురు క్వార్టర్‌లో వుంటే ఎంత కోపం వస్తుంది?

మా ఎదురింటి సుబ్బారావుది, నాది గుడివాడే. సత్యనారాయణపురమే. అంచేత మా ఇద్దర్లో ఎవరు ఏన్యువల్ లీవ్‌లో స్వగ్రామం వెళ్లినా భిలాయ్ నించి కొన్ని వస్తువులు తీసుకువెళ్లి అక్కడ బట్వాడా చేయడం, వాళ్లిచ్చినవి తీసుకురావడం చేస్తోంటాం. వస్తువులతోపాటు మా నానమ్మ ఏదో విశేషం అతని చెవిన వేసి నాకు చెప్పమంటుంది.

'మీ అక్కయ్యకి కూతురు పుట్టిందిట. మీ మేనల్లుడికి స్కూల్ ఫస్ట్ వచ్చిందట, మీ బాబాయ్ అమెరికా ప్రభుత్వం ఆహ్వానం మీద ఆ దేశానికి పర్యటనకి వెళ్లాడట' లాంటి విశేషాలు మా నానమ్మ ఎన్ని చెప్పినా సుబ్బారావు నా చెవిన వేయడు. నిర్లక్ష్యం!

కొత్తగా ఆ కష్టం ఇంకాస్త రెట్టింపయింది. అందుకు కారణం నా మేనల్లుడికి టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్‌గా వుద్యోగం రావడం, వాడు వుచితంగా రోజు విడిచి రోజు భిలాయ్‌కి మాట్లాడే సౌకర్యం వుండడం. సుబ్బారావు క్వార్టర్‌లో ఫోన్ లేదు. నాకూ లేదు కాబట్టే అక్కడ పేచీ లేదు. కాని సుబ్బారావు పనిచేసే ఫౌండ్రీలో అతని టేబిల్ మీదే రెండు ఫోన్లు వున్నాయి. నేను పనిచేసే సెక్షన్‌లో ఇంటర్నల్ ఫోన్ తప్ప బయటి నించి వస్తే రిసీవ్ చేసుకునే ఫోన్ లేదు.

సుబ్బారావుకి ఫోన్ చేసి నా మేనల్లుడు పండగకి మా ఇంటికి ఎవరొచ్చారో, ఉగాదికి ఏం వండారో లాంటివన్నీ చెప్పి నాకు చెప్పమంటూ వుంటాడు. ఈ సుబ్బారావు నాకు చెప్పడు గాక చెప్పడు. ఎందుకంటే నేను తోటి తెలుగువాణ్ణి. నేను ఏ పంజాబీనో, గుజరాతీనో అయితే చెప్పేవాడన్నమాట!

సాదా సీదా విషయాలు చెప్పక పోయినా ఫర్వాలేదు కాని మా నానమ్మ భిలాయ్‌కి ఒంటరిగా ఏ రైల్లో బయలు దేరింది లాంటి విషయాలు చెప్పకపోతే మరీ ఇబ్బంది కదా?

"సారీ రావుగారు. మర్చిపోయాను" అంటాడు అడిగితే.

"మా వారికి అసలేమీ గుర్తుండి చావడం లేదండి" అంటుంది సుబ్బారావు భార్య.

ఓ రోజు సుబ్బారావు మా సెక్షన్‌కి వచ్చి చెప్పాడు-

"ఇందాకే మీ మేనల్లుడు ఫోన్ చేశాడు. మీ ఇల్లు కొన్నాయనకి ఎయిడ్స్‌ట తెలుసాండి?"

"అరెరె పాపం. అంత ముసలాయనకి ఎయిడ్సేమిటి!" అన్నాను.

"అదే నాకూ ఆశ్చర్యంగా వుంది."

రెండు రోజుల తర్వాత మళ్లీ వచ్చి "మా పక్కింటి హెడ్ మాస్టారు కాలు విరిగిందిట. కర్వేపాకు కోయడానికి రేకుల షెడ్డు ఎక్కి పడ్డాడట" చెప్పాడు.

"అయ్యో పాపం" అన్నాను.

ఆ తర్వాత సుబ్బారావు తరచు మా సెక్షన్‌కి వచ్చి ఫోన్‌లో మా మేనల్లుడు చెప్పిన ఏదో ఓ చెడ్డ వార్త చెప్తూనే వున్నాడు.

"సత్యనారాయణ వ్రతానికి పిలిస్తే భోజనానికి వెళ్లిన మీ సందులోని ఇంజనీర్ ఆ ప్రసాదం తిని బాగా వాంతులై స్పృహ తప్పాడట."

"మా లెక్కల మాస్టారి భార్య లేచిపోయింది."

ఈ కొత్త రకం సమాచారం మిస్టరీ నాకు మా మేనల్లుడి నించి లెటర్ వచ్చే దాకా అర్థం కాలేదు.

*మామయ్యా!*

*ఆ సుబ్బారావు సంగతి ఆలస్యంగా తెలిసింది. ఇతరులకి జరిగిన చెడు వార్తని అందరికీ చెప్పాలన్న దృష్టి గల అతగాడికి ఇతరులకి జరిగే మంచి గురించి చెప్పడానికి మనసు రాదు. అందుకని నీకు చెప్పే విశేషాలు ఈ కోడ్‌లో చెప్తున్నాను. ఈ వుత్తరం జాగ్రత్తగా వుంచి గ్రహించగలవు.*

*ఎవరికయినా ఎయిడ్స్ అంటే - నానమ్మ బి.పి. తగ్గినట్టు*

*ఎవరి కాలయినా విరిగిందంటే - మీ నాన్నగారికి ప్రమోషన్*

*ఎవరయినా వచ్చారంటే - మా చెల్లెలుకి పెళ్లి చూపులు జరిగాయి*

*ఎవరి ఇంటికప్పయినా విరిగిందంటే - మా చెల్లెలు పెళ్లి ఖాయం అయింది.*

*ఏ సినిమా హాల్నో తగుల బెట్టారంటే - ఆ పెళ్లికి ముహూర్తాలు కుదిరాయి.*

*ఆ సినిమా హాలుకి ఇన్సూరెన్స్ కూడా లేదంటే - పెళ్లి ముహూర్తం మూడు నెలల లోపు.*

*మరికొన్ని కోడ్స్ ఇంకో ఉత్తరంలో రాస్తాను.*

*—రామచంద్రుడు*

వాడి తెలివికి ఆశ్చర్యం వేసింది నాకు. ఆలోచిస్తే నిజమే అనిపించింది. నన్ను పోలీసులు అరెస్ట్ చేశారన్న వార్త పాకినంత త్వరగా నాకు నోబెల్ బహుమతి వచ్చిందన్న వార్త పాకదు.

అందుకేనేమో, మన తెలుగు వాళ్లు మన తెలుగు దిన పత్రికల్లా తయారయ్యారు అంటుంటారు రూర్కెలాలో పని చేసే మా మావయ్య. ●

